ప్రాకింది. ఇక పోతే వ్యాపారరేఖ బుధస్థానాన్ని చూస్తూ ఉంది. ఈ రెండు రేఖల ఫలితంగా నీ స్వశక్తితో నీకు మంచి భవిష్యత్తు కనబడుతూంది. ఈ చింతచెట్టు క్రింద చిల్లరంగడి తిరుపతి పెద్ద బజారులో పేరు దెచ్చుకొంటుంది!"

"అయితే నా కోరిక నెరవేరుతుందన్నమాట!" ఎగిరి గంతేశాడు అంగడివాడు.

పుల్లయ్య 'స్వరం' చూచుకొన్నాడు. చంద్రనాడి కొంచెం చల్లుతున్నట్లుంది. అయినా, 'దిననాడి' కాబట్టి ఫరవాలేదనుకొన్నాడు. "కాదు గీదంటే కాస్త ఆలస్యం కావచ్చు"నని చెప్పాడు. ఇంతలో రైల్వేస్టేషన్‌లో కొట్టిన గంట వినబడింది. బండి వచ్చేవేళ అయిందన్నారు. పుల్లయ్య తాంబూలాన్ని మడిచి ఒడిలో దోపుకున్నాడు. "వస్తా నాయినా!" అంటూ లేచాడు.

అంగడివాడు అంజలి ఘటిస్తూ సాగనంపాడు.

పిల్లవాణ్ణి చిన్నగా నడిపించుకొంటూ, పుల్లయ్య స్టేషన్‌లో అడుగు పెట్టాడు. మరలా రెండవసారి గంట కొట్టారు. తిరుపతికి టిక్కెట్టు కొన్నాడు. అంతలో బండి వచ్చి ఆగింది. టిక్కెట్ కొంగులో భద్రంగా ముడిపెట్టుకొన్నాడు. రైలు రద్దీగా ఉంది. ఎక్కడచూచినా సందు లేదు. బండి పోతుందేమోనని తొందర తొందరగా ఈ ప్రక్కకు, ఆ ప్రక్కకు పరుగెత్తాడు. ఒక పెట్టె మాత్రం ఖాళీగా కనబడింది. అందులో ఎక్కాడు. 'పరుపులు గిరుపులు బలే బాగుండాయి! ఎర్రినాయాలి గుంపు ఎందుకట్ల తొక్కలాడతా ఉండారు!' అనుకొన్నాడు. పిల్లవాణ్ణి కూర్చోబెట్టాడు. ఎదురుగ ఉన్న నిలువుటద్దంలో చూచుకొని తలపాగా సర్దుకొన్నాడు. బుర్రమీసం దువ్వుకొన్నాడు. ధీమాగా కూర్చున్నాడు.

బండి కదులుతూ ఉంది. టి.టి.ఇ. అదే పెట్టెలో ఎక్కాడు. పుల్లయ్య వాలకం చూసి మంచి కేసు అని నవ్వుకున్నాడు. టిక్కెట్టు కోసం చెయ్యిచాశాడు. పుల్లయ్య కొంగు ముడి విప్పి టిక్కెట్టు చూపించాడు.

